క్లుప్తంగా

ఆంజనేయస్వామికి అలంకరణ



ప్రత్యేక అలంకరణలో ఆంజనేయస్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతిపేట జగన్నాథ స్వామి ఆలయంలో కొలువైన శక్తిపథ ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. పెంట వంశానికి చెందిన అర్చకులు స్వామివారికి అలంకరణ చేపట్టారు.

200 మంది రక్తదానం



రక్తదానం చేస్తున్న ఉద్యోగులు

రణస్థలం: పైడిభీమవరంలోని అరబిందో ఫార్మా ఫౌండేషన్ సమాజిక సేవలో భాగంగా శనివారం ఏపీటోరియా ఫార్మా ప్రైవేట్ లిమిటెడ్ యూనిట్-4లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఉద్యోగులు, కార్మికులు 200 మంది రక్తదానం చేశారు. రక్తాన్ని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఆధ్వర్యంల్లో సేకరించారు. హెచ్‌డీఎఫ్‌సీ ప్రతినిధి చలపతిరావు, ఎన్టీఆర్ ట్రస్టు వైద్యుడు సత్యనారాయణ, పరిశ్రమ వైద్యుడు సాయిద్ బురహన్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు సక్రమంగా చేపట్టాలి



మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు, ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల: మండలంలోని నిర్వహిస్తున్న ఉపాధి పనులను సక్రమంగా చేపట్టాలని ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఆవరణలో 2022-23లో చేపట్టిన ఉపాధి పనులకు సంబంధించి ప్రజావేదికను శనివారం నిర్వహించారు. ఎటువంటి అవకతవకలు పాల్పడినా సంబంధిత అధికారులు ఇబ్బంది పడాల్సి వస్తుందన్నారు. చేపట్టిన పనులు, వేతనదారులు, వేతనాలు, పరికరాలు వంటి అన్ని వివరాలను పక్కాగా నిర్వహించాలన్నారు. అనంతరం డ్వామా పీడీ చిట్టిరాజు ఆధ్వర్యంలో పంచాయతీల వారీగా చేపట్టిన పనులపై ఆరాతీశారు. సోషల్ ఆడిట్‌లో పెర్కొన్న సమస్యలపై సంబంధిత అధికారులను ఆరాతీసి నివేదికలను తయారుచేశారు. డ్వామా డీవీఓ లావరాజు, డ్వామా హెచ్‌ఆర్ శ్రావణ్, తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ రమాదేవి, ఏపీఓ శోభాదేవి, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

కొత్తపేట ఎంపీటీసీకి గాయాలు



గాయపడిన ఎంపీటీసీ నర్సింగరావు

ఎచ్చెర్ల క్యాంపస్: కొత్తపేట ఎంపీటీసీ గురుగుబెల్లి నర్సింగరావు శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డారు. తహసీల్దార్ కార్యాలయానికి పనిపై వచ్చి స్వగ్రామం బైక్‌పై వెళ్తున్నారు. కేశవరావుపేట పంచాయతీ కింతలిమిల్లు వద్ద ఉన్న యూటర్న్ తీసుకువెళ్తుండగా.. శ్రీకాకుళం నుంచి వస్తున్న బైక్ వెనుక నుంచి ఢీకొట్టింది. దీంతో బైక్ బోల్తాపడింది. గాయపడిన ఎంపీటీసీకి స్థానికులు సపర్యలు చేశారు. కుటుంబ సభ్యులు శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు. తలకు గాయాలు కావటంతో వైద్య పరీక్షలు నిర్వహించి డిశ్చార్జి చేశారు.

ఎస్ఐ గణేష్‌కు డీజీపీ అవార్డు



డీజీపీ చేతులమీదుగా అవార్డు అందుకుంటున్న ఎస్ఐ గణేష్

శ్రీకాకుళం క్రైమ్: జిల్లా కేంద్రంలో ఉన్న ఒకటో పట్టణ పోలీసుస్టేషన్ ఎస్ఐ బలివాడ గణేష్‌కు డీజీపీ డిస్క్ అవార్డు లభించింది. 2022 సంవత్సరానికి గాను శాంతి భద్రతల పరిరక్షణలో ప్రతిభ కనబర్చినందుకు అవార్డును రాష్ట్ర డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి చేతులమీదుగా శనివారం అందుకున్నారు. ఈ అవార్డు ఎంతో ఉత్సాహాన్నిచ్చిందని, మరింత బాధ్యతతో పనిచేసేందుకు దోహదపడుతుందని ఎస్ఐ గణేష్ ఆనందం వ్యక్తం చేశారు. ఆయనతో పాటు కవిటి మండలంలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహ్మద్ అహ్మద్ బషీర్‌కు అవార్డు రావడంతో జిల్లాలో ఈ అవార్డు ముగ్గురికి దక్కినట్లైంది.

నైపుణ్యంతోనే ఉజ్వల భవిష్యత్

- శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు
- కళాశాలలో ముగిసిన సాఫ్ట్‌స్కిల్స్ శిక్షణ



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు, పక్కన ట్రైనర్లు

శ్రీకాకుళం న్యూకాలనీ: విద్యార్థులకు సాధారణ విద్యతోపాటు సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ చాలా ముఖ్యమని శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ (అటానమస్) కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.సూర్యచంద్రరావు అన్నారు. స్టూడెంట్స్ స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రాంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అకాడమీ సహకారంతో ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో వారం రోజులుగా కళాశాల జవహర్ నాలెడ్జ్ సెంటర్(జేకేసీ), కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్ డిపార్ట్‌మెంట్స్ ఆధ్వర్యంలో ఏడు రోజులపాటు సాఫ్ట్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ప్రోగ్రాంపై విద్యార్థులకు శిక్షణ అందించారు. ఈ సందర్భంగా జరిగిన ముగింపు కార్యక్రమంలో జి.సుమలత మాట్లాడుతూ ఇంటర్‌పర్సనల్ అండ్ స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్ ఉన్న అభ్యర్థులను ప్రతి సంస్థ కోరుకుంటోందని చెప్పారు. వారం రోజుల వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకున్న విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ పి.శంకర్ నారాయణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ ఎస్.పద్మావతి, అకాడమిక్ కోఆర్డినేటర్ సీహెచ్ కృష్ణారావు, జేకేసీ కోఆర్డినేటర్ ఐ.శ్రీలక్ష్మి, స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ ఎస్.వాణికుమారి, ఎస్.మాధవిలత, అధ్యాపకులు పాల్గొన్నారు.

7 రోజులు.. 167 మందికి శిక్షణ

ఎంప్లాయిబిలిటీ స్కిల్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ఫర్ ఉమెన్ కార్యక్రమంలో నాంది ఫౌండేషన్ వారి మహేంద్ర ప్రైడ్ క్లాస్ ప్రోగ్రాం ట్రైనర్స్ ఎ.గీత, వై.హరికుమార్, ఎన్.జీవన్‌కుమార్‌లు రిసోర్స్ పర్సన్స్‌గా వ్యవహరించారు. ఏడు రోజులుపాటు ఎంపికచేసిన 167 మంది విద్యార్థులకు సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్స్ స్కిల్స్‌పై శిక్షణ అందించారు.

స్కిల్స్‌పై అవగాహన



కళాశాలలో వారం రోజులపాటు ఏర్పాటుచేసిన ఎంప్లయిబులిటీ స్కిల్స్ శిక్షణ కార్యక్రమం చాలా బావుంది. అనే విషయాలపై అవగాహన ఏర్పడింది.

– జి.హేమ, బీకాం తృతీయ సంవత్సరం

స్వేచ్ఛగా మాట్లాడేలా...



కాలేజీలో సాఫ్ట్‌స్కిల్స్, కమ్యూనికేషన్ స్కిల్స్‌పై వారం రోజులపాటు శిక్షణ ఇచ్చారు. గతంలో నాకు స్టేజ్ ఫియర్ ఉండేది. ఇప్పుడు దానిని అధిగమించాను. స్వేచ్ఛగా మాట్లాడే తీరు మెరుగుపర్చుకున్నాను.

– సీహెచ్ నీలిమ, బీఏ తృతీయ సంవత్సరం

ఉపయోగకరం



ట్రైనింగ్ ప్రోగ్రాం బాగా ఉపయుక్తమైంది. ఇంటర్వ్యూని ఎలా ఎదుర్కోవాలో తెలిసింది. ప్రశ్నలకు ఏ రీతిలో సమాధానాలు ఇవ్వాలో తెలుసుకున్నాను. కమ్యూనికేషన్స్ స్కిల్స్ నేర్చుకున్నాను.

– కె.ఢిల్లేశ్వరి, బీఎస్సీ తృతీయ సంవత్సరం

సీఎం జగన్‌తోనే అభివృద్ధి



సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. పొన్నాడ గ్రామ సచివాలయం-1, 2ల్లో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ జెండాను ఎగురవేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ప్రదర్శన బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో శుక్రవారం రాత్రి పల్లె నిద్ర, సహపంక్తి భోజనాల కార్యక్రమాలు నిర్వహించారు. పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల పరిషత్ విప్ బగ్గు రాజారావు, నాయకులు నేటింటి నీలమప్పుడు, అల్లు రాజారావు, పప్పల వెంకటరమణ, సర్పంచ్ నేతింటి యమున పాల్గొన్నారు.

ధ్యానంతో ఆరోగ్యకర జీవితం



సంగీత నాద ధ్యానం నిర్వహిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: ధ్యానంతో ఆరోగ్యకరమైన జీవితం లభిస్తుందని పరిమళ పత్రి అన్నారు. స్థానిక అంబేడ్కర్ ఆడిటోరియంలో పిరమిడ్ స్పిరిట్యువల్ సొసైటీ శ్రీకాకుళం శాఖ ఆధ్వర్యంలో ఆత్మ విజ్ఞాన కార్యక్రమం శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ధ్యానం ద్వారా మానసిక, ఆత్మపరమైన జీవితాల్లో వచ్చిన మార్పులపై అందరితో చర్చించారు. కళాశాల విద్యార్థులు భయాలను, పిరికితనాన్ని పోగొట్టుకొనే మార్గాలను సూచించారు. ఎస్.శ్రీనివాసరావుచే సంగీత నాద ధ్యానం కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో పీఎంసీ డైరెక్టర్ సిద్దా నాగేశ్వరరావు, గౌరవాధ్యక్షుడు వెంకట పద్మావతి, వాసవి పత్రి, మాస్టర్స్ బాలాజీరావు, సత్యనారాయణ, శివరామకృష్ణ, బిందుమాధవి, ధర్మారావు, రామారావు, వంశీ, రామకృష్ణరాజు, రేవతి, ఇందిరాలక్ష్మీ, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

వెంకన్నకు ప్రత్యేక పూజలు



నారాయణ తిరుమలలో వేంకటేశ్వరునికి పూజలు



పూజల్లో పాల్గొన్న భక్తులు



దూదివారి కోవెలలో తులసీమాల అలంకరణలో వేంకటేశ్వరుడు

శ్రీకాకుళం కల్చరల్: శ్రీకాకుళం నగరంలోని గుజరాతీపేటలో ఉత్తరాంధ్ర తిరుమల కొండగా పేరొందిన నారాయణ తిరుమల కొండపై వెలసిన వేంకటేశ్వరుని ఆలయంలో మార్గశిర మాస శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారికి ప్రత్యేక అష్టోత్తర శతనామాలతో పూజలు, ప్రత్యేక దర్శనాలు, ఉచిత దర్శనాల భక్తులతో ఆలయం రద్దీగా మారింది. ఆలయ అర్చకులు గురుగుబెల్లి శ్రీనివాసులు భక్తుల గోత్రనామాలతో అర్చనలు చేయించి, పూజలు జరిపించారు. శ్రీవేంకట రామానుజ సేవాదళం ఆధ్వర్యంలో సామూహిక విష్ణు సహస్రనామ పారాయణ చేపట్టారు.

తులసీమాల అలంకరణ

చిన్నబజారులోని దూదివారి వేంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారిని తులసీ మాలలతో అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు శ్రీనివాసాచార్యులు ఆధ్వర్యంలో అష్టోత్తర శతనామాలతో అర్చనలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.

షష్టి ఉత్సవాలు ప్రారంభం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉన్న ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో వేంచేసిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఆలయ అర్చకులు అశ్వినీకుమార్, మహేష్‌ల ఆధ్వర్యంలో స్వామివారికి పంచామృతాభిషేకాలు నిర్వహించారు. అనంతరం ప్రత్యేక అలంకరణ చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులకు జియో ట్యాగింగ్



జియో ట్యాగింగ్ నిర్వహిస్తున్న అధికారులు

శ్రీకాకుళం రూరల్: జిల్లా జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు మండల పరిధిలో ధాన్యం సేకరణలో భాగంగా పలు రైస్ మిల్లులకు తహసీల్దార్ ఎస్.వెంకట్రావు సమక్షంలో శనివారం జియో ట్యాగింగ్ నిర్వహించారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ డీటీ షరీఫ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగులపై విమర్శలు తగవు



మాట్లాడుతున్న ఏపీజీఏసీ రాష్ట్ర అధ్యక్షుడు అరెలయ్య

శ్రీకాకుళం: అంగన్‌వాడీ కార్యకర్తలు మీడియా సమావేశాల ద్వారా సచివాలయ ఉద్యోగులను కించపరచడం, విమర్శించడాన్ని వ్యతిరేకిస్తున్నామని ఆంధ్రప్రదేశ్ గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సంక్షేమ సంఘం(ఏపీజీఏసీ) రాష్ట్ర అధ్యక్షుడు, జనరల్ సెక్రటరీలు అరెలయ్య, సీపాన గోవిందరావు అన్నారు. శనివారం స్థానిక విలేకరులతో వారు మాట్లాడుతూ మీ ఆశయ సాధనాల కోసం మాత్రమే ప్రస్తావించుకుంటే బాగుంటుంది తప్ప తమను విమర్శించడం సరికాదన్నారు. తక్షణమే సచివాలయ ఉద్యోగులకు క్షమాణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘ జిల్లా అధ్యక్షుడు పాని రఘునాథ్, జనరల్ సెక్రటరీ పేడాడ అమర్నాథ్, సీపాన సింహాచలం, పైడిపెద్ది ధనుంజయ్, బొడ్డేపల్లి రవికిరణ్ పాల్గొన్నారు.

సైనికుల్లా పనిచేయాలి



ఎమ్మెల్యే కిరణ్‌కుమార్‌ను కలిసిన నాయకులు

ఎచ్చెర్ల క్యాంపస్ (రణస్థలం): పార్టీ బలోపేతం లక్ష్యంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. నియోజకవర్గం నుంచి జిల్లా అనుబంధ కమిటీల్లో నియమితులైన పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు రణస్థలంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శనివారం కలిశారు. ప్రభుత్వ పథకాలు ప్రజల్లోకి తీసుకువెళ్లాలని, ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న నవరత్నాలపై ప్రచారం చేయాలన్నారు. అర్హత గల ప్రతి ఒక్కరికీ ఇంటికి గ్రామ వలంటీర్లు వెళ్లి ప్రభుత్వ పథకాలు అందజేస్తున్నారన్నారు. 2024 సార్వత్రిక ఎన్నికలే లక్ష్యంగా పని చేయాలన్నారు. యువజన విభాగం కార్యదర్శి లంకలపల్లి గోపి తదితరులున్నారు.

ఘనంగా గణపతి హోమం



గణపతి హోమం నిర్వహిస్తున్న అర్చకులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పాలకొండ రోడ్డులో ఉన్నటువంటి విజయ గణపతి ఆలయంలో మార్గశిర మాస శుద్ధ చవితి సందర్భంగా గణపతి హోమం శనివారం జరిగింది. ఆలయ అర్చకులు పెంట శ్రీధర్‌శర్మ, సూర్యనగేష్ శర్మల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అర్చనలు నిర్వహించి, మూల మంత్ర సహిత గణపతి హోమం నిర్వహించారు.

ఉమాకవికి సత్కారం



ఉమాకవిని సత్కరిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో తాడేపల్లి గూడెంలో జరుగుతున్న కవి సమ్మేళనంలో భాగంగా జిల్లాకు చెందిన ఉమాకవిని శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా తెలుగు కవులకు వందనాలు కవితావిష్కరణను కత్తిమండ ప్రతాప్ నిర్వహించారు. కార్యక్రమంలో నిర్వాహకులు కొల్లి రమావతి, పెద్దింటి నిర్మల్‌కుమార్, దిలీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

• మర్యాదపూర్వక భేటీ



రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన సలహాదారుడు సజ్జల రామకృష్ణారెడ్డిని కళింగ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పాట్నూరు సూర్యం అమరావతిలో శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. తామంతా ఎల్లప్పుడూ వైఎస్సార్‌సీపీ వెంటే ఉంటామన్నారు.

– శ్రీకాకుళం(పీఎన్‌కాలనీ)

సైన్స్ ప్రదర్శనలతో విజ్ఞానం



జి.సిగడాం: మోడల్ పాఠశాల విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్టులను పరిశీలిస్తున్న అధికారులు



జి.సిగడాం: సంతవురిటి పాఠశాల విద్యార్థులు తయారు చేసిన రోబోను పరిశీలిస్తున్న దృశ్యం



ఎచ్చెర్ల: లావేరు మండలం అదపాకలో సైన్స్ ప్రదర్శనలు నిర్వహిస్తున్న విద్యార్థులు

జి.సిగడాం: స్థానిక మోడల్ పాఠశాలలో మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్‌ను శనివారం ఏర్పాటు చేశారు. జి.సిగడాం, ఎందువ, దేవరవలస, సంతవురిటి, బాతువ, డీఆర్‌వలస జెడ్పీ పాఠశాలలు, మోడల్ పాఠశాల, కస్తూర్బా గాంధీ విద్యాలయం నుంచి విద్యార్థులు తయారు చేసిన వివిధ రకాల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఎంఈఓ అరసాడ రవి, ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నా శామ్యూల్ లంక, ఏపీటీఎఫ్ శాఖ జిల్లా అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్, సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

లావేరు మండలంలో

ఎచ్చెర్ల (లావేరు): లావేరు మండలంలోని అదపాక గ్రామం ఉన్నత పాఠశాలలో మండల స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన పోటీలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలను వ్యక్తిగత కేటగిరీలో 12 ప్రాజెక్టులు, గ్రూపు పోటీల్లో 26 ప్రాజెక్టులు, ఉపాధ్యాయ కేటగిరిలో 2 ప్రాజెక్టులను ప్రదర్శించారు. వ్యక్తిగత కేటగిరిలో అదపాక పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న ఎల్.సాయికార్తీక్ ఎంపికయ్యాడు. గ్రూప్ కేటగిరిలో మురపాక పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బి.హరిప్రియ, ఐ.రోహన్ ఎంపికయ్యారు. టీచర్ కేటగిరిలో భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు బి.వెంకటరావు ప్రదర్శన ఎంపికయ్యింది. మూడు కేటగిరీల్లో ఎంపికైన ప్రాజెక్టులు ఈ నెల 20వ తేదీన శ్రీకాకుళంలో గవర్నమెంట్ బాయ్స్ ఉన్నత పాఠశాలలో నిర్వహించే జిల్లా స్థాయి సైన్స్ ఫేర్‌లో ప్రదర్శిస్తామని ఎంఈఓ మజ్జి మురళీకృష్ణారావు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

జి.సిగడాం: స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలకు ఈ నెల 17న విద్యుత్ సరఫరా నిలుపుదల చేయనున్నారు. ఈ మేరకు విద్యుత్‌శాఖ డీఈఈ ఎస్.బయ్యన్నాయుడు శనివారం తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల చేయనున్నామన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.